సాక్షి అనంతపురం

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



సీతాఫలం.. ఆరోగ్యం పదిలం

పల్లెటూరి మధుర ఫలంగా చెప్పుకునే సీతాఫలం సీజన్ మొదలైంది. మార్కెట్లలో విక్రయాలు ప్రారంభమయ్యాయి.

8లో



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టం రూ.27 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

34.1°/23.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



జైలులో సౌకర్యాలపై ఆరా తీస్తున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్

కళ్యాణదుర్గం: ఖైదీలు జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం కళ్యాణదుర్గం సబ్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగు దొడ్లు, శుభ్రత, స్టోర్ రూం, కిచెన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి చక్రవర్తి, న్యాయవాదులు దేవేంద్ర, పలువురు పాల్గొన్నారు.

లావణ్య పాలీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: నగరంలో రామచంద్ర నగర్‌లోని లావణ్య పాలీ క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.భ్రమరాంబ దేవి గురువారం సీజ్ చేశారు. కూడేరు మండలం హంసపల్లి గ్రామానికి చెందిన వేలూరు రాధకు ఇటీవల కడుపు నొప్పి రావడంతో వైద్యం కోసం లావణ్య పాలీ క్లినిక్‌కు వెళ్లారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్ ఆమెకు ఆపరేషన్ చేయగా అది వికటించింది. దీంతో భర్త రామానాయుడు, కుటుంబీకులు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి క్లినిక్‌లో ప్రాథమిక విచారణ చేపట్టారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగినట్లు తేలడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. శస్త్రచికిత్స వికటించిన విషయమై విచారణకు ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీ వేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్‌పై తదుపరి చర్యలుంటాయని ఆమె పేర్కొన్నారు.

చెల్లెల్నే చెరబట్టిన కామాంధుడు

పెద్దపప్పూరు: సొంత చిన్నాన్న కుమార్తెనే ఓ కామాంధుడు చెరబట్టాడు. వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి బాలిక బాగోగులను ఆమె పెదనాన్న కుమారుడు రామాంజనేయులు చూసుకుంటున్నాడు. అప్పటికే తనకు పెళ్లై, ఇద్దరు పిల్లలు ఉన్నా.. పాడు బుద్ధితో బాలికపై కన్నేశాడు. ఇటీవల వినాయక చవితి సందర్భంగా బాలిక ఇంటికి వచ్చిన సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బయట ఎక్కడా చెప్పరాదంటూ బెదిరించాడు. ఈ క్రమంలోనే యాడికి మండలంలో తను విద్యనభ్యసిస్తున్న పాఠశాలకు బాలిక చేరుకుంది. గురువారం పాఠశాలలో తన స్నేహితురాళ్లకు విషయం తెలపగా.. వారు పాఠశాల నిర్వాహకురాలికి తెలియజేశారు. ఆమె వెంటనే ఎస్‌ఐ గౌస్‌బాషాకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రామాంజనేయులును అదుపులోకి తీసుకుని అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు.

నాణేలను తిరస్కరించొద్దు

అనంతపురం అర్బన్: చెలామణిలో ఉన్న నాణేలను తీసుకునేందుకు విముఖత చూపకూడదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. అలా తిరస్కరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాణేల అంశంపై గురువారం ఆయన స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నాణేలను ఆర్థిక, సామాజిక, సాంస్కృతికత,కాలానుగుణంగా పరిచయం చేస్తారన్నారు. ప్రస్తుతం 1, 2, 5, 10 రూపాయలకు సంబంధించి నాణేలు చెలామణిలో ఉన్నాయన్నారు. ఈ నాణేల వాస్తవికతపై కొన్ని వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. దీంతో వ్యాపారులు, దుకాణదారులు వీటిని తీసుకోవడం లేదన్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలను తిరస్కరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని బ్యాంకు శాఖల్లోనూ నాణేలను మార్పిడి చేసుకోవచ్చని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2019 జనవరి 14న ప్రత్యేకంగా బ్యాంకులకు సూచనలు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు.

కళ్లు మూసుకున్నాం.. కొల్లగొట్టేయండి!

వాగు, వంకా తేడా లేదు. నది, కాలువా లెక్కేలేదు. అధికారం మాది.. మేమేం చేసినా అడిగేవారెవరన్న దర్పంతో మట్టి కొల్లగొడుతున్నారు.. ఇసుక తోడేస్తున్నారు. అధికారుల కంట పడకుండా అర్ధరాత్రో, తెల్లవారు జామునో గుట్టుగా తరలిస్తున్నారనుకుంటే పొరబాటే. పట్టపగలే అందరూ చూస్తుండగానే సహజ వనరులను దోచుకుంటున్నారు. ప్రభుత్వానికి పైసా సుంకం చెల్లించకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అప్పనంగా దోచుకుంటున్నారు. పలు చోట్ల నియోజకవర్గ ప్రజాప్రతినిధుల అండ, అవినీతి అధికారుల చేయూతతో మరింతగా రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకుల ఇసుక అక్రమ రవాణా, ఎర్ర మట్టి దందా యథేచ్ఛగా సాగుతూనే ఉంది.

- ఆగని టీడీపీ నాయకుల ఇసుక, మట్టి దందా
- అధికారుల అలసత్వంతో మరింతగా రెచ్చిపోతున్న వైనం
- అనంతపురం రూరల్ కృష్ణమరెడ్డిపల్లి, ఆలమూరు సమీపంలో యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు



పెద్దపప్పూరు మండలం జూటూరు వద్ద పెన్నానదిలో ఇసుక తవ్వకాలు

ప్రజాప్రతినిధి అండతో...

పామిడి: పట్టణంలో ఇసుక, గరుసు అక్రమ రవాణా రోజురోజుకు ఎక్కువవుతోంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండలతో అధికార పార్టీకి చెందిన పామిడి దందా రాయుడు ఇసుక, గరుసు అక్రమ రవాణాను మూడు పువ్వులు–ఆరు కాయల చందాన సాగిస్తున్నాడు. పామిడి సమీపంలో పెన్నానదిలోని పంప్ హౌస్ ప్రాంతం నుంచి ఇసుక పట్టపగలే అక్రమంగా తరలిపోతోంది. ఇసుక, గరుసు అక్రమ తవ్వకాలకు ఆ దందా రాయుడు ఏకంగా ఇటాచీని పెట్టుకున్నాడు. రోజుకు 40 టిప్పర్ల దాకా ఇసుక, 30 టిప్పర్లు దాకా గరుసును గుత్తి, గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నాడు. టిప్పరు ఇసుక రూ.20 వేలు, టిప్పరు గరుసు రూ.5 వేల చొప్పన రోజుకు రూ.10 లక్షల అక్రమంగా వెనకేసుకుంటున్నాడు. ఇసుక అక్రమ రవాణాతో పంప్‌హౌస్ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదముందంటూ గతంలో హైకోర్టు నుంచి పలువురు స్టే తెచ్చారు. గరుసు అక్రమ రవాణాతో కొండలు తరిగిపోతే ప్రకృతికి విఘాతం తప్పదు. ఇంత జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పామిడిలో పట్టపగలే టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం



పామిడిలో ఇసుక అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

జేసీ సొంత గ్రామంలో విచ్చలవిడిగా దోపిడీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: జేసీ సొంత గ్రామమైన పెద్దపప్పూరు మండలం జూటూరులోనే రోజూ దర్జాగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇసుకాసురుడు జేసీల బంధువు కావడంతో అధికారులు అటు వైపు చూడలేకపోతున్నారు. జూటూరు నుంచి నరసాపురం వరకూ గ్రామాలు పెన్నా నది పరివాహకంగా ఉన్నాయి. నదిలో అక్రమంగా ఇసుక నింపుకున్న టిప్పర్లు నిత్యం పదుల సంఖ్యలో తాడిపత్రి పట్టణ సమీపంలో ఉన్న కర్మాగారాలకు తరలివెళ్తున్నాయి. ఇసుకాసురుడు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడు. పట్టపగలే పెన్నానదిలో జేసీబీతో ఇసుక తవ్వుతున్నా పోలీసులు కానీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు కానీ అటు వైపు చూడడం లేదు. ఇసుక తవ్వకాలకు తాము వ్యతిరేకం.. ఎవరూ పెన్నానదిలో ఇసుక తవ్వకూడదంటూ ఇటీవల తాడిపత్రి పరిసర ప్రాంతంలో సొంత పార్టీ పార్టీ కార్యకర్తనే తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అడ్డుకున్నారు. జూటూరులో మాత్రం సొంత బంధువు కావడంతో పట్టించుకోవడం లేదు. దీనిపై ఎవరైనా తనకు ఫిర్యాదు చేస్తారని పసిగట్టడంతోనే 'నాకు జ్వరం వస్తోంది. ఫోన్‌లో కూడా మాట్లాడలేని పరిస్థితి. ఎవరూ ఫోన్ కూడా చేయవద్దు' అంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన ప్రకటించినట్లు తెలుస్తోంది. దీంతో ఎవరికి చెప్పాలో తెలియక కిందిస్థాయి టీడీపీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. కార్యకర్తలకో న్యాయం, బంధువులకో న్యాయమా అంటూ నిట్టూరుస్తున్నారు. ఇసుకాసురుడి ఆగడాలతో భూగర్భ జలం అడుగంటి రైతుల పొలాల్లో బోర్లు బావురుమంటున్నాయి. జూటూరు, జోడి ధర్మాపురం గ్రామాలకు చెందిన రైతులు మామిడి, రేగు, అల్లనేరేడు, సపోట వంటి పంటలు వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. బోర్లు ఎండిపోతుండటంతో చెట్లు వాడిపోతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడుతున్నా మారని తమ్ముళ్లు

శింగనమల: పోలీసులు పట్టుకుంటున్నా, జరిమానాలు విధిస్తున్నా శింగనమల నియోజకవర్గంలో ఇసుకాసురులు ఆగడం లేదు. శింగనమల మండలంలోని పెరవలి, పి.జలాలపురం, కల్లుమడి సమీపంలోని పెన్నానది నుంచి రాత్రిళ్లు ఇసుక అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. పెరవలి, పి.జలాలపురం వంకల్లో నుంచి రోజూ రాత్రిళ్లు 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా నార్పల, తాడిపత్రి, అనంతపురం పట్టణాలకు తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం నాగులగుడ్డం సమీపంలోని కుంట వద్ద తెలుగు తమ్ముళ్లు ఇటాచీ పెట్టి టిప్పర్లతో ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక, మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జలాలపురం వంకలో ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు

కొండ కరిగించేస్తున్న పుత్రరత్నం



ఆలమూరు ఎర్రకొండ నుంచి జేసీబీతో మట్టి తవ్వి టిప్పర్లలో తరలిస్తున్న దృశ్యం

అనంతపురం టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమార్కుల పుణ్యమా అని అనంతపురం రూరల్ మండల పరిధిలోని కృష్ణమరెడ్డిపల్లి సమీపంలో ఉన్న పెద్దకొండ, ఆలమూరు సమీపంలోని ఎర్రకొండలు కరిగిపోతున్నాయి. రోజూ టిప్పర్లతో వందలాది ట్రిప్పుల ఎర్రమట్టిని నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ రెండు కొండల నుంచి తరలిస్తున్న ఎర్రమట్టి ద్వారా రోజూ రూ. 3 లక్షలకు పైగానే అక్రమార్కులు జేబుల్లోకి వేసుకుంటున్నారు. పోలీసులకు మాత్రం ఈ ఎర్రమట్టి వాహనాలు కనిపించకపోవడం విశేషం. రెండు నెలలకు పైగా ఎర్రమట్టి దందా సాగుతున్నా ఇటుకలపల్లి, అనంతపురం రూరల్, నగరంలోని వివిధ స్టేషన్ల పోలీసుల కంట పడకపోవడం ఆశ్చర్యకరం. ఇక భూగర్భ గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినా కూడా ఆ కొండల వైపు చూడలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడి హస్తం..

ఎర్రమట్టి దోపిడీ వెనుక రాప్తాడు నియోజకర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడి హస్తం ఉంది. ప్రారంభంలో టీడీపీకి చెందిన కొందరు కార్యకర్తలు ఎర్రమట్టిని తోలుకున్నారు. ఆ తర్వాత ముఖ్యనేత కుటుంబ సభ్యుడు రంగప్రవేశం చేశారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేశారు. తన తరపున ఇటాచీలు, జేసీబీలను పెట్టి మట్టిని తవ్విస్తున్నారు. కొండల వద్ద ఒక వ్యక్తిని ఉంచి ఆయన ద్వారా ఒక్కో టిప్పరుకు రూ. 3 వేల దాకా వసూలు చేయిస్తున్నారు. రోజూ 90–110 ట్రిప్పులు తరలిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఎర్రమట్టి అక్రమ రవాణా విషయం రెండు కీలకశాఖల ఉన్నతాధికారుల దృష్టికీ వెళ్లింది. వారు కూడా మౌనం దాల్చడం అనుమానాలకు తావిస్తోంది. ఆలమూరు జగనన్న కాలనీకి ఆనుకునే ఎర్రకొండ ఉంటుంది. మట్టికోసం జేసీబీతో పెద్ద పెద్ద గుంతలు పెడుతున్నారు. చివరకు ఇళ్ల ప్లాట్ల మధ్యలో కూడా గుంతలు పెట్టేశారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సహజ వనరుల అక్రమ దోపిడీకి అడ్డుకట్ట వేస్తారా...లేదా? చూడాలి.

పాఠశాలల్లో న్యూట్రీషన్ గార్డెన్లు



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆవరణలో న్యూట్రీషన్ గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూట్రీషన్ గార్డెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించడంతో పాటు పర్యావరణంపై పరిజ్ఞానాన్ని పెంపొందించవచ్చన్నారు. పర్యావరణ సమస్యలు, సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పించవచ్చన్నారు. ఉపాధి పథకం ద్వారా పాఠశాల ఆవరణ చుట్టూ మునగ, కరివేపాకు మొక్కలు నాటాలన్నారు. ప్రతి స్కూలులో కిచెన్ గార్డెన్‌కు సంబంధించి ఉపాధ్యాయుడిని నోడల్ అధికారిగా నియమించాలని, హార్టికల్చర్ అసిస్టెంట్లు పర్యవేక్షించేలా చూడాలన్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన పరికరాల కోసం సర్వ శిక్ష అభియాన్ నిధులు అందిస్తామన్నారు. దీంతో పాటు ఆయా పాఠశాలల్లో ఒక ఎకో–క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల స్థాయి ఎకో–క్లబ్‌లో టీమ్ లీడర్‌గా ప్రధానోపాధ్యాయుడు, సహాయకులుగా ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక తరగతి ఉపాధ్యాయుడు, కో–ఆర్డినేటర్‌గా ఒక విద్యార్థి, సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉండాలన్నారు. జిల్లాస్థాయి ఎకో–క్లబ్‌కు కలెక్టర్ లేదా జెడ్పీ సీఈఓ చైర్‌పర్సన్‌గా, కన్వీనర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రతినిధులుగా కృషి విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి, అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ/ ఉద్యాన శాఖ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు నుంచి ఒక్కొక్కరు ఉంటారని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఈఓ వరలక్ష్మి, ఏడీ నాగరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అధికారులందరూ చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఓవర్ బ్రిడ్జ్ కింద వైపు స్థలంతో పాటు పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 30 బైకులు, 10 నాలుగు చక్రాల వాహనాలు, 20 మిక్స్‌డ్ వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. ఒక్కో మల్టీ లెవెల్ పార్కింగ్‌ను రూ.50 లక్షలతో ఏర్పాటు చేయాలన్నారు. టవర్ క్లాక్ బ్రిడ్జ్ కింద ఖాళీ స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ కార్యాలయంలో నాలా ట్రాక్టర్ ట్రాలీని, జేసీబీలను కలెక్టర్ పరిశీలించారు. నేషనల్ క్లీన్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, రోజూ నివేదికలు అందించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

భళా బాలికా..

- రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేత జిల్లా జట్టు



విజేత అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం, ఏపీ ఫుట్‌బాల్ సంఘం(ఏపీఎఫ్‌ఏ) సంయుక్త ఆధ్వర్యంలో కానూరులోని అనుమోలు ప్రభాకర్ ప్లే ఫీల్డ్‌లో మూడురోజుల పాటు అత్యంత రసవత్తరంగా జరిగిన ఈ పోటీల్లో 12 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. గురువారం ఉదయం జరిగిన రెండో సెమీఫైనల్స్‌లో కర్నూలు జట్టును శ్రీసత్యసాయి జిల్లా జట్టు 4–5 తేడాతో ఓడించి ఫైనల్స్‌కు చేరింది. అనంతరం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా జట్ల మధ్య ఆసక్తికరపోరు నడిచింది. అనంతపురం జట్టు క్రీడాకారులు అనూష రెండు గోల్స్ చేయగా, కాంచన, నందిని చెరో గోల్ చేశారు. అనంతపురం జట్టు 4–0 తేడాతో ప్రత్యర్థి శ్రీసత్యసాయి జట్టును ఓడించి విజేతగా నిలిచింది. రన్నర్ ట్రోఫీని శ్రీసత్యసాయి జిల్లా జట్టు దక్కించుకుంది.మూడో స్థానం కోసం సెమీస్‌లో ఓడిన కడప, కర్నూలు జట్లు తలపడగా, కడప 2–0 తేడాతో కర్నూలు జట్టును ఓడించి మూడోస్థానంలో నిలిచింది. ఫైనల్ పోటీలను ఏపీఎఫ్‌ఏ కార్యదర్శి డానియేల్ ప్రదీప్ పర్యవేక్షించారు. విజేతలకు అనుమోలు ప్రభాకర్, కె.బాలకృష్ణ, ఏపీఎఫ్‌ఏ ఉపాధ్యక్షులు ముని శ్రీనివాసరావు, కోశాధికారి విజయ్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షకార్యదర్శులు శేషగిరిరావు, చక్రవర్తి ట్రోఫీలు అందజేసి అభినందించారు.



రన్నర్ ట్రోఫీని అందుకున్న శ్రీసత్యసాయి జట్టు

డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీ జాప్యంపై '43 వేల హెక్టార్లు... 33 వేల మంది రైతులు' శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పరికరాల పంపిణీకి సంబంధించిన ఫైలుపై కలెక్టర్ వినోద్‌కుమార్ సంతకం చేశారని పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. 139.30 హెక్టార్లకు పరికరాలు ఇవ్వడానికి 113 మంది రైతులకు మంజూరు ఉత్తర్వులు వచ్చాయన్నారు. వీలైనంత త్వరగా మెటీరియల్ సరఫరా చేసి బిగించే కార్యక్రమం చేపడతామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో పరిపాలన అనుమతి కోసం మరోఫైలు కలెక్టర్‌కు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హంద్రీనీవా ఎస్‌ఈ దేశేనాయక్ బదిలీ

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో 75 మంది ఏఈలు, 23 మంది డీఈలకు స్థానచలనం కలిగింది. ఈ క్రమంలో హంద్రీనీవా ఇన్‌చార్జ్ ఎస్‌ఈ దేశేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. చిన్ననీటి పారుదలశాఖ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా పనిచేస్తున్న సి. ప్రతాప్‌ను నంద్యాల కేసీ కెనాల్ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. హెచ్‌ఎల్‌సీ డీఎస్‌ఈ సునీల్‌నాయక్ తిరుపతి సీఈ ఆఫీసు డీఎస్‌ఈగా, ధవళేశ్వరం ప్రాజెక్టులో ఈఈగా పనిచేస్తున్న సూర్యభాస్కర శర్మ హెచ్చెల్సీ డీఎస్‌ఈగా నియమితులయ్యారు. హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా కర్నూలు చిన్ననీటి పారుదలశాఖ ఈఈగా పనిచేస్తున్న రెడ్డిశేఖరరెడ్డిని నియమించారు.

రాజకీయ బదిలీలు..

- 22 తేదీతో ఉత్తర్వులు జారీ

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో మార్పులు జరిగాయి. పాత తేదీతో (ఈనెల 22వ తేదీ) ఉత్తర్వులు గురువారం జారీ అయ్యాయి. 19 మంది డీటీలు, 18 మంది ఎంఆర్‌ఐలు, ఎస్‌ఏలకు స్థానాలను మార్పు చేశారు.

ఒత్తిళ్లతోనే..

రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ మార్పులు జరిగినట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధుల సిఫారసు ఉన్న ఉద్యోగుల్ని వారు కోరిన స్థానాలకు బదిలీ చేశారని తెలిసింది. సిఫారసు చేయించుకోలేని వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేశారనే అభిప్రాయం ఆ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

వృద్ధురాలిపై దూసుకెళ్లిన ఎద్దుల బండి


చికిత్స పొందుతున్న భీమక్క

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో ఓ వృద్ధురాలిపై ఎద్దులబండి దూసుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... ఉంతకల్లులో నివాసముంటున్న వృద్ధురాలు కె.పెద్ద భీమక్క ఈ నెల 20న ఓ దుకాణం వద్ద కూర్చొని ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన రైతు బసవరాజు ఎద్దులబండి ఆమెపై దూసుకెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటపై గురువారం బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పెద్ద భీమక్క కుమారుడు శంకర్ తెలిపారు.

దళితుడి భూమిని కాజేసే కుట్ర


ప్రభుత్వం మంజూరు చేసిన సాగు పట్టాను చూపుతున్న ఓబులేసు

విడపనకల్లు: ప్రభుత్వం సాగు హక్కు కల్పించిన దళితుడి భూమిని కాజేసే కుట్రకు స్థానిక టీడీపీ నాయకులు తెరలేపారని బాధితుడు హరిజన ఓబులేసు తెలిపాడు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన దళితులకు బంజరు భూమిపై సాగు హక్కులు కల్పిస్తూ పత్రాలను పంపిణీ చేసిందన్నాడు. ఇందులో భాగంగానే అప్పట్లో సర్వే నంబర్ 60బీలో 2.84 ఎకరాల భూమికి తన భార్య హరిజన చౌడమ్మ పేరుతో సాగు హక్కు పత్రం మంజూరైందన్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు స్థానిక టీడీపీ నాయకులు తమ భూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని వాపోయాడు. 20 రోజుల క్రితం కంది పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారని గుర్తు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే... తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడినని ఒకే ఒక్క కారణంతో టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ అక్రమంగా తనపైనే కేసు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా తమకు అనుకూలంగా ఉన్న పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించేలా చేస్తున్నారని మండిపడ్డాడు. తనకు, తన కుటుంబానికి టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

సీతాఫలం.. ఆరోగ్యం పదిలం

- రాయదుర్గం మార్కెట్‌లో మొదలైన సీతాఫలం విక్రయాలు
- రెండు నెలల పాటు కొనసాగనున్న సీజన్


రాయదుర్గం పట్టణంలో విక్రయానికి ఉంచిన సీతాఫలం

రాయదుర్గంటౌన్: పల్లెటూరి మధురఫలం సీతాఫలం రాయదుర్గం మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. పేదోడికి అందుబాటులో ఉండి, ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం ప్రస్తుతం నిరుపేద కుటుంబాలకు జీవనాధారమైంది. ఎన్నో పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలు ఉన్న సీతాఫలాన్ని ప్రకృతి కేవలం వర్షపు నీటితోనే ఎలాంటి ఎరువులు లేకుండానే అందజేస్తుండడం గమనార్హం.

కొండ గుట్టల్లో విస్తారంగా చెట్లు

రాయదుర్గం, గుమ్మఘట్ట పరిసరాల్లోని కొండలు, గుట్టల్లో 8 నుంచి 10 వేల ఎకరాల్లో సీతాఫలం చెట్లు విస్తరించి ఉన్నాయి. ఒక్క పదునైన వర్షం కురిస్తే చాలు సహజసిద్ధంగా మధురమైన సీతాఫలాల దిగుబడి మొదలవుతుంది. ఈ క్రమంలో ఇటీవల ఆశించిన మేర వర్షాలు కురవడంతో గత ఏడాది కంటే ప్రస్తుతం దిగుబడి మెరుగ్గానే ఉందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. రాయదుర్గం, పైతోట, గొల్లపల్లి, గలగల, శిరిగేదొడ్డి, చెరువుదొడ్డి, అడిగుప్ప, 75 వీరాపురం ప్రాంతాల్లో సీతాఫలం లభిస్తుంది. వందలాది మంది కుటుంబాలు కొండల్లో నుంచి సీతాఫలాలను గంపల్లో తీసుకొచ్చి పట్టణంతో పాటు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. వారం రోజులుగా మార్కెట్‌లోకి భారీ ఎత్తున గంపల్లో సీతాఫలం తీసుకువస్తున్నారు. రెండు నెలలకుపైగా సీతాఫలం సీజన్ కొనసాగుతుంది. పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో సైజును బట్టి గంపల్లో, లేదా కిలోల ప్రకారం విక్రయిస్తున్నారు. సీతాఫలం విక్రయాలపై ఆధారపడి దాదాపు 400కు పైగా కుటుంబాలు జీవిస్తున్నాయి.



పోషక విలువలు పుష్కలం

పోషకాలు అధికంగా ఉండడంతో సీతాఫలం పండు తియ్యగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ పండును ఇష్టంతో తింటారు. దీంతో మంచి ఆరోగ్యం కూడా లభిస్తుంది. మాంసకృతులు, పీచు, ఖనిజ లవణాలు, విటమిన్లు, శరీరానికి శక్తినిచ్చే కొవ్వు పుష్కలంగా ఉంటాయి. ఇందులో లభించే మెగ్నీషియం శరీర పనితీరును మెరుగుపర్చి గుండెజబ్బుల నుంచి కాపాడుతుంది. సీజన్‌తో పాటు వచ్చే ఈ పండ్లను ప్రతి ఒక్కరూ కచ్చితంగా తీసుకోవాలని వైద్యనిపుణులు సూచనలు ఇస్తారు.

వందలాది కుటుంబాలకు జీవనాధారం



“సీతాఫలం సీజన్ మొదలైతే రెండు నెలల పాటు వందలాది కుటుంబాలకు చేతి నిండా పని ఉంటుంది. రోజూ కొండపైకి వెళ్లి కాయలు సేకరించి మరుసటి రోజు మార్కెట్‌లో విక్రయిస్తుంటాం. గత ఏడాది వర్షాలు లేక నష్టపోయాం. ఈసారి వర్షాలు ఆశాజనంగా రావడంతో దిగుబడి బాగా ఉంది. నవంబర్ నెలాఖరు వరకూ ఈ సీజన్ ఉంటుంది. నేను దాదాపు 30 ఏళ్లుగా ఇదే వ్యాపారం చేస్తున్నా.

– బి.ఓబయ్య, పైతోట, రాయదుర్గం

సైజును బట్టి ధర

ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గంలో సీతాపలాల కొనుగోలు సీజన్ పూర్తిగా ప్రారంభమైంది. సరిహద్దు కర్ణాటక నుంచి అనేక మంది వ్యాపారులు వచ్చి బాక్సుల ప్రకారం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. సైజును బట్టి విక్రయాలు సాగుతున్నాయి. కిలో రూ.40 నుంచి రూ.60 వరకూ ధర పలుకుతోంది. గంప అయితే ఒక్కొదానికి రూ.300 నుంచి రూ.400 సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో గంపలో దాదాపు 150 నుంచి 200ల సీతాఫలాలు ఉంటాయి.

కలెక్టర్‌గారూ... మీ హామీతో సమ్మె విరమించాం

- పదిరోజులైనా సమస్యకు పరిష్కారం చూపలేదు
- శ్రీరామరెడ్డి ప్రాజెక్ట్ కార్మికుల వినతి


కలెక్టర్ వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న తాగునీటి పథకం కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులు, నాయకులు

అనంతపురం అర్బన్: ‘సార్... మా వేతన, ఈపీఎఫ్ బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని ఈ నెల 17న మీరు ఇచ్చిన హామీతో నిరవధిక సమ్మెను విరమించి విధుల్లోకి చేరాం. అయితే పది రోజులైనా మీరిచ్చిన హామీ అమలు కాలేదు. ఇప్పుడేమి చేయాలి?’ అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను శ్రీరామరెడ్డి నీటి సరఫరా ప్రాజెక్ట్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులు ప్రశ్నించారు. తాగునీటి పథకం కార్మికులతో కలసి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టరును ఆయన కలసి మాట్లాడారు. బకాయి వేతనాలు చెల్లింపు, ఈపీఎఫ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేపడితే, సమస్య పరిష్కరిస్తామని... విధుల్లోకి చేరాలని నాడు కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు తాము సమ్మె విరమించి విధుల్లోకి చేరామని గుర్తు చేశారు. అయితే రోజులు గడుస్తున్నా... సమస్యలు అలాగే ఉండిపోయాయని, వేతనం, పీఎఫ్ బకాయిలు నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌ను అడితే బిల్లులు రాలేదని సమాధానమిస్తున్నాడని, ఈ విషయంలో జోక్యం చేసుకుని బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, ఇతర నాయకులు ఉన్నారు.

వారు చెబితేనే బిల్లులు చేస్తారా?

- పంచాయతీల పరిధిలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు పెట్టని కార్యదర్శులు
- టీడీపీ నేతల ఒత్తిళ్లే కారణమంటున్న అధికారులు
- టీడీపీ నేతల వైఖరితో గ్రామాభివృద్ధి కుంటుపడుతోందన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు


మాట్లాడుతున్న సర్పంచులు, ఎంపీటీసీలు

ఆత్మకూరు: గ్రామాభివృద్ధిపై ఆశలు పెట్టుకున్న ప్రజలు ఎంతో నమ్మకంతో తమను ప్రజాప్రతినిధులు ఎన్నుకున్నారని, వారి ఆశలు వమ్ము చేయకుండా అప్పు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేస్తే బిల్లులు చేయకుండా అధికారులను టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని ఆత్మకూరు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. టీడీపీ నేతల వైఖరితో గ్రామాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆత్మకూరు ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బర హేమలతను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలసి మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కలెక్టర్ సార్ చొరవ తీసుకోవాలి

గతంలో తాము చేసిన పనులకు పెండింగ్‌లో బిల్లుల మంజూరుకు ఆమోదం తెలిపితే ప్రస్తుతం మీరు చేసిన పనుల బిల్లులు కూడా వచ్చేలా చేస్తామని ఓ పంచాయతీ సర్పంచ్‌తో స్థానిక టీడీపీ నేతలు ఒప్పందం చేసుకున్నారని విలేకరుల సమావేశంలో ప్రజాప్రతినిధులు తెలిపారు. వారి బిల్లులు మంజూరు కాగానే, ప్రస్తుతం తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అడ్డుకుంటూ అధికారులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. వారికి తెలియకుండా బిల్లులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని తమను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారంటూ కార్యదర్శులు వాపోతున్నారన్నారు. ఇదే అంశంపై టీడీపీ నేతలను కలసి ప్రశ్నిస్తే.. బిల్లులు కావాలనుకుంటే తమ పార్టీ పెద్దలను కలవాలని, లేకుంటే బిల్లులు మంజూరు కావని తేల్చిచెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు సైతం ఓ పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారని మండిపడ్డారు. వాటర్‌మెన్, వీధి బల్బులు మార్చే ఎలక్ట్రీషియన్, పైప్‌లైన్లు మరమ్మతులు చేసే వారికి సైతం బిల్లులు మంజూరు కాకుండా టీడీపీ నేతలు అడ్డుకోవడం దారుణమన్నారు. మూడు నెలలుగా చిరుద్యోగుల బిల్లులు కూడా పెండింగ్‌లో పెడితే వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులతో తాము చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, అప్పు చేసి అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని వాపోయారు. రూ.లక్షల్లో బిల్లులు పేరుకుపోవడంతో అప్పులకు వడ్డీలు సైతం చెల్లించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్‌కుమార్‌నాయక్, సర్పంచ్‌లు వరలక్ష్మి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేసు, ఎర్రిస్వామి, ఓబులేసు, చంద్రశేఖర్, తిరుపాలమ్మ, ఉజ్జినప్ప, ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణానాయక్, రవి నాయక్, జగదీష్, ఎర్రిస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గుంటూరులో ఉచిత శిక్షణ

తాడిపత్రి అర్బన్: విద్యార్థుల్లో మానసిక ప్రవర్తనా లోపాలను సరిచేసి, ఆత్మ విశ్వాసం పెంపొందించే దిశగా ఉపాధ్యాయులకు గుంటూరులో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (స్టెప్) సమన్వయకర్తలు సత్య ప్రసాద్‌రెడ్డి, సేతు రామేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేక్కల్లులోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమం వేదికగా శిక్షణా తరగతులు ఉంటాయి. శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనాలతో పాటు మెటీరియల్, సర్టిఫికెట్లు అందజేస్తారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు 94904 19365, 94915 09440 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి.

యువకుడిపై హత్యాయత్నం

రాప్తాడు రూరల్: సరదాగా మద్యం తాగిన స్నేహితుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి వివాదం ఒకరిపై హత్యాయత్నానికి దారి తీసింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి సమీపంలోని కాలనీలో నివాసం ఉంటున్న చిన్నదేవ, అనంతపురం నగరానికి చెందిన హరీష్ స్నేహితులు. ఓ మహిళ విషయంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 24న హరీష్, చిన్నదేవ.. వారి స్నేహితులతో కలసి అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలో ఉన్న ఓ తోటలో మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. పూటుగా మద్యం సేవించిన తర్వాత చిన్నదేవ, హరీష్ మధ్య సదరు మహిళ విషయం చర్చకు వచ్చింది. అది కాస్త గాలివానలా మారడంతో తన స్నేహితులతో కలసి చిన్నదేవపై హరీష్ దాడి చేశాడు. తలపై రాయితో బాది, కట్టెలతో విచక్షణారహితంగా చితకబాదడంతో చిన్నదేవకు కాలు విరిగింది. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అది చూసి భయపడిన స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో మెలుకువ వచ్చిన బాధితుడు తనను కాపాడాలంటూ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని తోటలో ఉన్న రైతు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో ఇద్దరు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి గ్రామ శివారులో పంట పొలాలకు రక్షణగా ఏర్పాటు చేసిన తీగలను బుధవారం అర్ధరాత్రి అపహరించుకెళుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని గుత్తి మండలం ఈశ్వరపల్లికి చెందిన నరసింహులు, నాగరాజుగా గుర్తించారు. ప్రస్తుతం నరసింహులు గుంతకల్లులో, అదే మండలం ఇమాంపురంలో నాగరాజు నివాసముంటున్నారు. ఇద్దరూ వ్యసనాలకు బానిసై తమ అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మార్నేపల్లి గ్రామ శివారులో పంట పొలాల్లో రక్షణ తీగలు తొలగించి ఆటోలో వేసుకుని వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఆటోను సీజ్ చేసి, రక్షణ తీగలను స్వాధీనం చేసుకున్నారు. తమ ఆధీనంలో ఉన్న నిందితులను పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రమాదంలో కంబదూరు వాసి మృతి


రాజగోపాల్ (ఫైల్)

కంబదూరు: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో కంబదూరుకు చెందిన రాజగోపాల్ (65) మృతిచెందాడు. గురువారం నాగలాపురం గేట్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆయనను ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమైన ఆయనను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక రాజగోపాల్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

‘కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి’

అనంతపురం మెడికల్: ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సంబంధిత అధికారులను జిల్లా కుష్టు వాధి నివారణ విభాగం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి సరైన వైద్యం అందిస్తే అంగవైకల్యం బారి నుంచి రక్షించవచ్చనన్నారు. కుష్టు వ్యాధి నివారణ అంశంపై డిప్యూటీ పారా మెడికల్ అధికారులతో గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ... కొత్తగా కేసులు నమోదైన ప్రాంతంలో ఫోకల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కుష్టు వ్యాధిపై ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేసేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కుష్టు వ్యాధి నివారణకు మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. సమావేశంలో డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ శివారెడ్డి, పారా మెడికల్ అధికారి నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో 68 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీల్లో 68 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. సీఆర్టీలు 20, పీజీటీలు 21, పార్ట్‌టైమ్ టీచర్లు 16, వార్డెన్ 7, అకౌంటెంట్ పోస్టులు 4 భర్తీ చేయనున్నారు. సీఆర్టీలు, పీజీటీ పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో, తక్కిన పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు https://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

కణేకల్లు: లారీ ఢీకొన్న ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన కంబరి తిప్పేస్వామి (50)కి భార్య తిమ్మక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై రేకులకుంట గ్రామానికి బయలుదేరిన ఆయనను రాయదుర్గం మండలం వేపరాల వద్ద లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన తిప్పేస్వామిని స్థానికులు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు.

వైభవంగా హర్యాలీ తీజ్ ఉత్సవాలు


చివరి రోజు సంప్రదాయ నృత్యం చేస్తున్న బంజారా మహిళలు

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్ తండాలో హర్యాలీ తీజ్ ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో గిరిజనులు నిర్వహిస్తూ వచ్చారు. చివరి రోజూ వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక, రాజస్తాన్ తదితర ప్రాంతాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో రూపానాయక్ తండా కిక్కిరిసింది. గురువారం ఉదయం తీజ్ వేడుకల్లో భాగంగా గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్, సామాసంగ్‌మహారాజ్, తుల్జాభవానీ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయ నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అధికారులు, బంజారా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బంజారా పీఠాధిపతులు పాల్గొన్నారు.

బోగస్ విద్యార్థి, కుల సంఘాల దందాను అరికడతాం


డీఎస్పీ శ్రీనివాసరావును అభినందిస్తున్న జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు

అనంతపురం: బోగస్ విద్యార్థి, కుల సంఘాల దందాను అరికడతామని జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులకు డీఎస్పీ శ్రీనివాసరావు భరోసానందించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు గురువారం ఆయన తన కార్యాలయంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. అక్రమ దందాపై ఆరా తీశారు. బోగస్ విద్యార్థి, కుల సంఘాలను అరికట్టే దిశగా వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు గోపాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఆర్ఓ రవి చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, నగర అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నగర కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చీనీ మొక్కల నరికివేత

పెద్దపప్పూరు: మండలంలోని రెడ్డిపల్లిలో చీనీ మొక్కలను దుండగులు నరికి వేశారు. వరుసగా ఇలా ఐదోసారి జరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు... ఎందుకు ఇలా మొక్కలు నరికేస్తున్నారో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు... రెడ్డిపల్లికి చెందిన మహిళా రైతు వెంకటలక్ష్మి తనకున్న 2.50 ఎకరాల్లో చీనీ మొక్కలు నాటారు. ఈ క్రమంలో ఈ ఏడాది మే 23న దుండగులు తోటలోకి చొరబడి 50 మొక్కలను నరికి వేశారు. దీంతో నరికి వేసిన మొక్కల స్థానంలో కొత్తగా మరో 50 మొక్కలను ఆమె నాటారు. గురువారం తెల్లవారుజామున మరోసారి తోటలోకి చొరబడిన దుండగులు నాలుగు నెలల వయసున్న 50 మొక్కలను నరికి వేశారు. ఘటనపై సమాచారం అందుకున్న పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ గౌస్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఏడాది క్రితం కూడా తన తోటలో మొక్కలను దుండగులు నరికివేశారని, వరుసగా మూడోసారి ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు వెంకటలక్ష్మి వాపోయింది. అదే గ్రామానికి చెందిన బాలవర్ధిరాజు, బెడుదూరి భాస్కర్‌కు చెందిన తోటల్లోనూ చీనీ చెట్లను ఏడాది క్రితం దుండగులు నరికివేసినట్లు గుర్తు చేశారు. చీనీ మొక్కల నరికి వేతకు కారకులైన దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బాధిత మహిళా రైతు ఫిర్యాదు చేశారు.

జీపు దగ్ధం

అనంతపురం: నగరంలోని భవానీ నగర్ ప్రధాన రోడ్డుపై గురువారం మధ్యాహ్నం ఆపి ఉన్న జీపుపై దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. జీపు యజమాని నాగరాజు, డ్రైవర్ నవీన్ తెలిపిన మేరకు... భవానీ నగర్‌కు చెందిన డ్రైవర్ నవీన్ గురువారం తెల్లవారుజామున పేపర్ బండిళ్లను తాడిపత్రిలో అన్‌లోడ్ చేసి, మధ్యాహ్నం 12 గంటలకు భవానీ నగర్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు. జీపును ఇంటి వద్దనే నిలిపి లోపలకెళ్లి నిద్రించాడు. సుమారు 12:30 గంటల సమయంలో దుండగులు జీపుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఇటీవల రూ.2 లక్షలు వెచ్చించి జీపును ఆధునీకరించారని, ఘటనతో రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్యాటక దినోత్సవం నిర్వహణపై ఉదాసీనత

అనంతపురం కల్చరల్: ఈ సారి జిల్లాలో పర్యాటక దినోత్సవం నిర్వహణపై అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను చాటుతూ, వాటి అభివృద్ధికి పునరంకితం కావాలన్న లక్ష్యంతో ఏటా సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని గుత్తి కోట, అరుదైన శిల్పకళల కాణాచిగా ఖ్యాతిగాంచిన తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర, చింతల వేంకటరమణ స్వామి ఆలయాలు, కోన జలపాతాలు, జిల్లా సరిహద్దున ఉన్న బెలూం గుహలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఏటా పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అధికారిక వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది పర్యాటక దినోత్సవం ముందు రోజు (గురువారం) అర్ధరాత్రైనా వేడుకల నిర్వహణ ఊసే లేకుండా పోయింది. అయితే వేడుకలను నిర్వహించాలని జిల్లా పర్యాటక శాఖ కీలక అధికారి... అవార్డుల ఎంపిక కోసం విజయవాడకు వెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక దినోత్సవాన్ని ఆటపాటలతో, ప్రత్యేక కళారూపాలతో పండుగలా నిర్వహించిన అధికారి నాగేశ్వరరెడ్డి తన మాతృశాఖ ఆకాశవాణికి వెళ్లిపోయారు. దీంతో ఈ సారి పర్యాటక దినోత్సవాన్ని ఎక్కడ నిర్వహిస్తారనేది సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణపై చర్చ



సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమైన పశుశాఖ డీడీ, ఏడీలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక పశుశాఖ జేడీ కార్యాలయ ఆవరణలో ఉన్న సొసైటీ మీటింగ్ హాలులో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా యూనియన్ పర్సన్ ఇన్‌చార్జ్, డీడీఏహెచ్ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, షీప్ డెవలప్‌మెంట్ ఏడీ డాక్టర్ శ్రీలక్ష్మి, సహకార అధికారి చలపతి హాజరయ్యారు. ప్రాథమిక సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లు, సభ్యులతో గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి సమస్య లేనందున సాధ్యమైనంత తొందరగా ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సహకార అధికారి అవగాహన కల్పించారు. ఎన్‌సీడీసీ రుణాలు, రికవరీ, జీవాల సంరక్షణ చర్యలు, కాపర్ల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.


దివ్యాంగ విద్యార్థులకు చేయూత



కుర్చీలు, స్కూల్ సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని రాస్ (రాష్ట్రీయ సేవా సమితి వికాస విహార్) సంస్థలోని దివ్యాంగ చిన్నారులకు ఎస్‌కేపీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కమలనాథ్ నేతృత్వంలో గురువారం కుర్చీలు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ సంస్థ అధ్యక్షుడు టీవీరెడ్డి, లఘుచిత్రాల దర్శకుడు తరిమెల రాజు, సంపాదకులు తోట నాగరాజు మాట్లాడారు. మానసిక పరిపక్వత లేక జీవిస్తున్న పిల్లలను చేరదీసి వారి సంరక్షణ బాధ్యతను చేపట్టిన రాస్ సంస్థకు అందరూ తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

జీఓ 42 రద్దు చేయాలి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీసీటీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఇబ్బందిగా మారిన జీఓ 42 రద్దు చేయాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అనంతపురంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వంలో విలీనం కోసం గతంలో 42 జీఓ విడుదల చేశారన్నారు. తద్వారా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల పదోన్నతులకు ఇబ్బందిగా ఉందన్నారు. సర్వీస్ నిబంధనలు లేకుండానే ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులకు ఇచ్చిన పదోన్నతులను వెంటనే రద్దు చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని సత్యకుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. శ్రీధర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ జి. రాజశేఖర్, అధ్యాపకులు డాక్టర్ జి.చలపతి, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీలో చోటు



వేమన

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమనకు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా అవకాశం కల్పించారు. ఈనెల 22, 23 తేదీల్లో విజయవాడలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని సుబ్బరాయనిపల్లి గ్రామంలో గురువారం ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ వెంకట నారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎన్ఎం కుమారి పాల్గొన్నారు.



రుద్రంపేటలో గుంపుగా తిరుగుతున్న శునకాలు



రామచంద్ర నగర్‌లో కుక్కల సంచారం

భౌబోయ్.. కరిచేస్తున్నాయ్ !

నగరంలో కుక్కల బెడద రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు తెగబడుతున్నాయి. ప్రధానంగా నీరుగంటి వీధి, మున్నానగర్, రెవెన్యూ కాలనీ, రుద్రంపేటలో గ్రామ సింహాల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక రాత్రి పూట ద్విచక్ర వాహనాల్లో వచ్చే వారిపై దాడికి దిగుతున్నాయి. వాహనాల వెనుక పరుగులు తీస్తూ ప్రమాదాలకు కూడా కారణం అవుతున్నాయి. ఇటీవల ఉప్పరపల్లికి చెందిన ఓ చిన్నారిపై శునకాలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శునకాలు యథేచ్ఛగా సంచరిస్తున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి కుక్కల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ఇటీవల కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఉప్పరపల్లికి చెందిన ఓ చిన్నారి (ఫైల్)

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు, ఐదేళ్ల లోపు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారం తీసుకోవడం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టడమే కాకుండా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెప్పారు. కిశోర బాలికలకు పోషకాహారం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, పండ్లు కూరగాయలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సంక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 27 నుంచి ఏఐఎస్ఎఫ్ మహాసభలు



మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 49వ రాష్ట్ర మహాసభలు నవంబర్ 27 నుంచి 30 వరకు విజయనగరంలో జరుగుతాయని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయంలో మహాసభలకు సంబంధించి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని లక్ష్యంతో స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. విజయనగరంలో నాలుగు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర మహాసభల్లో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సాయిస్వరూప, రాధాజ్యోతి, చందు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నగర నాయకులు తారక్, ఆనంద్, మహేష్, మంజు, మనోజ్, నాని, చరణ్, మారుతి, ఆకాష్ పాల్గొన్నారు.

మెరిట్ అభ్యర్థులకు మొండిచేయి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీలో అన్ని అర్హతలు, అనుభవం ఉన్న మెరిట్ అభ్యర్థులకు మొండిచేయి చూపి అస్మదీయులకు అవకాశం కల్పించారని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు విమర్శించారు. గురువారం వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్‌కుమార్, చిగండి రమేష్, సురేష్, విష్ణువర్ధన్, జయసింహా, రజాక్, గోవిందు నాయక్, సుధీర్, రాకేష్ తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సైతం మభ్యపెట్టే రీతిలో ఓ ఉన్నతాధికారి మొత్తం తతంగాన్ని నడిపించారని ఆరోపించారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ గానీ, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ గానీ అకడమిక్ కన్సల్టెంట్లుగా ఎంపిక చేసిన వారు పాఠాలు చెప్పేటప్పుడు వచ్చి నేరుగా వచ్చి వినాలన్నారు. పీహెచ్‌డీ ఉండి, నాలుగు, ఐదు సంవత్సరాలు విశేష అనుభవం కలిగిన వారిని పక్కనబెట్టి, తమ ఇష్టానుసారం ఎంపిక చేశారని మండిపడ్డారు. ఇందులో ఓ ఉన్నతాధికారి హస్తం ఉందని ఆరోపించారు. ఆయనపై విచారణ జరిపి తప్పిదాలను సరి చేయాలని కోరారు.

బీసీ కుల గణన చేపట్టాలి



మాట్లాడుతున్న సాకే నరేష్

అనంతపురం రూరల్: బీసీ కుల గణన చేపట్టి దేశంలో ఉన్న బీసీల లెక్క తేల్చకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పతనం తప్పదని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ అన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో బీసీలు సగానికి పైగా కులం ఆధారంగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అములు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు బీసీలను తీవ్ర నిర్లక్షం చేస్తున్నాయన్నారు. కుల గణన కులాల వారీగా జరగాలని అనేక కమిషన్లు చెబుతున్నా ప్రభుత్వాలు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బీసీ కుల గణన చేపట్టి ఆయా వర్గాల వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నారాయణ స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సభ్యత్వం పెంచాలి



గార్లదిన్నెలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి రమ

గార్లదిన్నె/పామిడి: గ్రంథాలయంల్లో సభ్యత్వం పెంచాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రమ సూచించారు. గురువారం గార్లదిన్నె మండల కేంద్రంలోని లైబ్రరీని ఆమె పరిశీలించారు. ముందుగా లైబ్రరీలో రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రంథాలయంలో సభ్యత్వాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాల అధికారిని శిరీష, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమె పామిడి పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె గ్రంథాలయ రికార్డులను, పుస్తకాలను తనిఖీ చేశారు. మండలంలోని గ్రంథాలయ సెస్సు బకాయిలపై గ్రంథాలయాధికారిణి వెంకటలక్ష్మమ్మతో సమీక్షించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి

పెద్దవడుగూరు: రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చిట్టూరు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సస్య రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పొలాల్లో ఆకులు ముడుతలు పడి కణువుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. సహజసిద్ధంగా లోపం కలిగిన నేలల్లో 2 గ్రాముల జింకు సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి రెండు లేదా మూడు సార్లు 5 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. అనంతరం పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్, జిల్లా ప్రతినిధి గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా టెన్నిస్ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌లో భాగంగా లాన్‌టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు బి. సుగుణమ్మ, డి. మొరార్జీ యాదవ్ తెలిపారు. గురువారం అనంతపురంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచితంగా ట్యాలీ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఉచితంగా కంప్యూటర్ ట్యాలీ, ఏసీ, ఫ్రిడ్జ్‌ల రిపేరీపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 రోజుల ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. పేర్లను నమోదు చేయించుకునేందుకు 9618876060, 8309915577 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఫెయిల్ అయినా, లేదా మధ్యలో చదువు మానేసిన విద్యార్థులకు ఇది మంచి అవకాశమని తెలిపారు. అలాంటి విద్యార్థులు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనంతపురం రూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఏ.నారాయణపురం పంచాయితీలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసతంబాబు, తహసీల్దార్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి రూ.40,930 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని పప్పూరు రోడ్డులో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లక్ష్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.40,930 నగదుతో పాటు మట్కా చీటీలను కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'సమగ్ర'లో అందని జీతాలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు సకాలంలో జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సత్యసాయి జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి రామన్న తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు నెల జీతం ఇప్పటికీ జమ కాలేదన్నారు. చిరుద్యోగుల కుటుంబాల నిర్వహణ చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ప్రతినెలా మొదటి వారంలోనే జీతాలు జమ చేసేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ నియామకాల్లో ప్రస్తుతం పని చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జీజీహెచ్‌కు మరో మహాప్రస్థానం వాహనం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మరో మహాప్రస్థానం వాహనం అందుబాటులోకి రానుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ఎంపీగా ఉన్న తలారి రంగయ్య ఎంపీ ల్యాడ్స్ ద్వారా జీజీహెచ్‌కు రూ.8.18 లక్షలు విలువ చేసే మహాప్రస్థానం వాహనం కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ వాహనం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉంది. అయితే మృతులు మరణించినప్పుడు వారిని తీసుకునేందుకు అనువుగా ఈ వాహనాన్ని రీ మాడల్ చేసి వచ్చే నెల 1 నుంచి వాహనాన్ని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అనంతరాముడు

అనంతపురం: అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వినయ్ కుమార్ ఫుట్‌బాల్ అండర్–17 విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు, సీఈఓ నరసింహా రావు, హెచ్ఎం నలిని తదితరులు విద్యార్థిని అభినందించారు. ఈనెల 28న పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వినయ్ కుమార్ పాల్గొంటాడు.

కేసు నమోదు చేయాలి

అనంతపురం రూరల్: ఎరుకుల లక్ష్మీదేవిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని గురువారం అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూడేరు మండలం జయపురంలో ఇచ్చిన డబ్బు ఇవ్వమని అడిగినందుకు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మర్రిస్వామి అతడి కుటుంబ సభ్యులు లక్ష్మీదేవి అతడి భర్త సంజీవరాయుడిపై దాడి చేశారు. కులం పేరుతో దూషించారన్నారు. మీకిష్టమొచ్చిన చోట చెప్పుకోండి ప్రభుత్వం మాది మమల్ని ఎవరూ ఏమి చేయలేరని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇదే విషయంపై కూడేరు పోలీస్ స్టేషన్‌లో లక్ష్మీదేవి ఫిర్యాదు చేసిన అక్కడ పోలీసులు పట్టించుకోలేదని మండపిడ్డారు. బయటే పంచాయతీ చేసుకోవాలంటూ.. దాడికి పాల్పడిన వారికే వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

2 వరకూ స్వచ్ఛతా హీ సేవా



ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, అధ్యాపకులు

అనంతపురం: స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమం అందరి బాధ్యత అని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వర్సిటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్కేయూలో ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.



రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

● ఇక్కడ ఇలా.. అక్కడ అలా

అనంతపురం రూరల్ మండలం కురుగుంట పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ఇటీవల భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే పాత కురుగుంటకు వెళ్లే దారిలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ భవనం పూర్తయి అందులోనూ ఉద్యోగులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులో పేర్లు కనిపించకుండా పేపర్లతో కప్పేశారు. సచివాలయం పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రం బోర్డుకు కూడా ఇలానే పేపర్లు అతికించారు. స్థానిక నేతల ఆదేశాలతో సచివాయ ఉద్యోగులే ఇలా బోర్డుకు పేపర్లు అతికించారని స్థానికులు చెబుతున్నారు. ఈ రెండు ప్రాంతాలను చూసిన ప్రజలు ఇక్కడేమో రోడ్డు వేయకనే శిలాఫలకం నాటారు. అక్కడ భవనం పూర్తయి వాడుకలో ఉన్నా బోర్డు కనిపించకుండా పేపర్లు అతికించారంటూ చర్చించుకుంటున్నారు. పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– రాప్తాడురూరల్:



సచివాలయం బోర్డుకు పేపర్లు అతికించిన దృశ్యం